క్లుప్తంగా

విరిగిన లారీ ముందు చక్రాల ఇరుసు



గడ్డర్ విరిగిపోయి రోడ్డుపై నిలిచిన లారీని పొక్లెయిన్‌తో పక్కకు జరుపుతున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని పుల్లయ్య రామాలయం ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం కాకినాడ వైపు వెళుతున్న లారీ ముందు చక్రాల గడ్డర్ (ఇరుసు) విరిగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చివరకు పొక్లెయిన్‌ను రప్పించి లారీ రోడ్డు చెంతకు జరిపి మరమ్మతులు చేశారు. పట్టణ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ

అమలాపురం టౌన్: సంక్రాంతి సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది, అర్చకులకు శనివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వీరీతాదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు ఫణి దంపతులు సిబ్బందికి వస్త్రాలు అందజేశారు. ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష చామంతి పూజ

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని లక్ష్మీగణపతి, షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయంలో శనివారం లక్ష చామంతి పూజ నిర్వహించారు. గత 40 ఏళ్లుగా క్రమం తప్పకుండా భోగి రోజును లక్ష చామంతి పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పేరి కొండబాబు తెలిపారు. పేరి లక్ష్మణరావు సోదరులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కె.రాంబాబు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

పెద్ద మనసుతో ఆదుకోరూ..



అనారోగ్యం బారిన పడి ఉన్న కుడిపూడి వెంకటలక్ష్మి

తాళ్లరేవు: అనారోగ్యం బారిన పడి లేవలేని స్థితిలో ఉన్న రెక్కాడితే గాని డొక్కాడని మహిళ తనను పెద్ద మనుసుతో తనను ఆదుకోవాలని అభ్యర్థిస్తోంది. వివరాల్లోని వెళితే మండలంలోని ఉప్పాంగల పంచాయతీ తెలుగోడుపాలెంకు చెందిన కుడిపూడి వెంకటలక్ష్మి(కల్యాణి) అనే నిరుపేద మహిళ అనారోగ్యంతో గత 8 నెలలుగా మంచాన పడి వుంది. శనివారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ తన చికిత్సకు రూ.5 లక్షల వరకు తాను, తన బంధువులు ఖర్చు చేశారని అయినప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో మళ్లీ చికిత్సకు వైద్యులు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతాయని అంటున్నారని దయగల దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

గుండాటపై ఉక్కుపాదం

అల్లవరం: సంక్రాంతి సంబరాల్లో కోడి పందేలకు అనుమతులు ఇస్తూ గుండాటపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. దీంతో అల్లవరం మండలంలోని కోడి పందెం బరులు వెలవెలబోయాయి. కోడూరుపాడులోని గుబ్బలవారిపాలెం, గుత్తులవారిపాలెం, అల్లవరం, రెల్లుగడ్డ, దేవగుప్తం, గోడి, బోడసకుర్రు గ్రామాల్లో శనివారం ఉదయం పది గంటలకు కోడి పందేలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు పందేలతో పాటు గుండాటను ప్రారంభించారు. ప్రతి బరిలో మూడు నుంచి ఆరు గుండాట టేబుల్ ఏర్పాటు చేశారు. పందేలతో పాటుగా గుండాటను నిర్వహకులు ప్రారంభించడంతో పోలీసులు ఉక్కుపాదం మోపారు. తొలుత గుబ్బలవారిపాలెం, గుత్తులవారిపాలెం, దేవగుప్తం, అల్లవరం, గోడి పందేం బరుల్లో గుండాల టేబుల్స్‌ని పోలీసులు ధ్వంసం చేశారు. రెల్లుగడ్డలో రెండు సార్లు గుండాట నిర్వహించగా పోలీసులు ధ్వంసం చేశారు. పందెం బరుల్లో గుండాటకు అవకాశం లేకపోవడంతో పందెం రాయుళ్లు నిరుత్సాహపడ్డారు. గుండాట లేకపోవడంతో ఈ ఏడాది కొత్తగా వేసిన బోడసకుర్రు పందెం బరిని మధ్యాహ్నానికే సర్దేశారు.

అమలాపురం రూరల్: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలకు అనుమతి ఇచ్చిన పోలీసులు గుండాట, పేకాటపై ఉక్కు పాదం మోపారు. కోడిపందాల నిర్వహణ ఖర్చులో అధిక శాతం గుండాట ద్వారానే వస్తుంది. వాటికి అనుమతులు లేకపోవడంతో కోడిపందేలు మందకోడిగా సాగుతున్నాయి. మండలంలో ఇందుపల్లి, గున్నేపల్లి అగ్రహారం, బండారులంక, పేరూరు కామనగరువు, చిందాడగరువు సవర్పాపాలెం గ్రామాల్లో కోడి పందేల బరుల వద్ద ఏర్పాటు చేసిన గుండాట బల్లలను ఎస్సై అందే పరదేశి ఆధ్వర్యంలో పోలీసులు తొలగించారు.



అమలాపురంలో కోడిపందేలు



అమలాపురంలో కోనసీమ సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ బాలాజీ దంపతులు



ఉప్పలగుప్తంలో భోగిమంట



యానాం హైస్కూల్ రోడ్డులో భోగి మంట వద్ద చిన్నారులు

భోగిభాగ్యాలు కలగాలని..



మొగళ్లమూరులో భోగి మంటను వెలిగిస్తున్న ఎంపీ అనురాధ

- ఊరూవాడా సంక్రాంతి సంబరాలు
- భోగి మంటల వద్ద సందడి చేసిన యువత

అమలాపురం టౌన్: నియోజకవర్గంలోని అమలాపురం పట్టణంతో పాటు 60 గ్రామాల్లో దాదాపు 160 చోట్ల భోగి మంటలు వెలిగాయి. వేకువ జాము నుంచే ఆయా ప్రాంతాల్లో పిల్లలు, యువకులు భోగి మంటలను వెలిగించి భగభగ మండేలా ఆవు పిడికల దండలు వేశారు. పల్లెల్లో గంగిరెద్దులు సన్నాయి తాళాలతో ఇళ్ల ముందుకు వచ్చాయి. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో తన నివాసం వద్ద హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ సందెప్ప బాలాజీ ఆధ్వర్యంలో కోనసీమ సంక్రాంతి సంబరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అక్కడ ఏర్పాటు చేసిన భోగి మంట అందరినీ ఆకర్షించింది. డాక్టర్ బాలాజీ కుటుంబీకులు కత్తులు లేని కోళ్లతో సరదా పందేలకు శ్రీకారం చుట్టారు. గంగిరెద్దులు, కోలాటం, హరిదాసు సంస్కృతీ సంప్రదయాల ప్రదర్శనలు సంక్రాంతిని ప్రతిబింబించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను పలువురు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అల్లవరం: మొగళ్లమూరులోని ఎంపీ నివాసం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటను ఎంపీ అనురాధ వెలిగించారు. ఎంపీ వెంట డాక్టర్ వంశీధర్ ఉన్నారు.

ఉప్పలగుప్తం: భోగి పండగను మండల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెల్లవారుజామున ఇంటిల్లిపాది తలస్నానాలు చేసి భోగి మంటల వద్ద సందడి చేశారు. గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఇందుపల్లిలో సంప్రదాయ వస్త్రధారణతో భోగి వేడుకలు

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లి అరవగరువులో సామూహిక భోగి వేడుకలు నిర్వహించారు. పెద్దలు, పిల్లలు సంప్రదాయ వస్త్రాలు ధరించి 108 ఆవు పిడకల దండలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భారీ భోగిమంటలో పిడకల దండలు వేశారు. సామూహికంగా సంప్రదాయ వస్త్రధారణలో 108 మంది ఒకేసారి భోగి దండలు వేయడం భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుతో పాటు, తానా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదైంది.

ముమ్మిడివరం: సంక్రాంతిలో తొలి ఘట్టమైన భోగి పండగన భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గత జ్ఞాపకాలకు వీడ్కోలు పలుకుతూ, కొత్త ఉషస్సు కోసం వీధివీధినా వేకువనే భోగి మంటలు వేశారు. సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు పోశారు. రేగు పండ్లను పిల్లల తలమీద పోసి, చుట్టు పక్కల వారిని, బంధువులను ఆహ్వానించి వాయనాలు ఇచ్చారు. పిండి వంటలతో సంప్రదాయ బద్ధంగా భోజనం చేశారు. గోదాదేవి భక్తికి మెచ్చిన శ్రీమహావిష్ణువు భోగినాడు ఆమెను పరిణయ మాడాడు. అందుకే విష్ణుమూర్తికి భోగి పండుగ అంటే చాలా ఇష్టం. వైష్ణవ ఆలయాల్లో శ్రీరంగ నాయక స్వామి వారితో గోదాదేవి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఐ.పోలవరం: గ్రామాల్లో వీధివీధినా యువకులు, పిల్లలు భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలూ శనివారం సంప్రదాయబద్ధంగా భోగిపండగను జరుపుకొన్నారు. ఈ పలు ఆలయాల్లో సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. పండగను పురస్కరించుకొని పలుచోట్ల బంధువులు, స్నేహితులు కలసి పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

యానాం: యానాంలోని పలు వీధుల్లో తెల్లవారు జాము నుంచే భోగిమంటలు వేశారు. అధిక సంఖ్యలో యువతీ,యువకులు, మహిళలు భోగి మంటల వద్ద సందడి చేశారు. బంధువులు, స్నేహితులుఎ వచ్చే జనంతో స్థానిక న్యూ బస్టాండ్, పాత బస్టాండ్ కిటకిటలాడాయి.

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో సీతమ్మపేటలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, కూరాటి దయాలత, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అనాతవరం టెక్ మంత్రా నొ సాఫ్ట్ వేర్ కంపెనీలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగురంగుల రంగవల్లులు, రంగ వల్లు మధ్య భోగికి గుర్తుగా గొబ్బెమ్మలు పెట్టి పాటలు పాడారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆటా పాటలతో ఉల్లాసంగా గడిపారు.



ఇందుపల్లిలో భోగి దండలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

వీరభద్రునికి ప్రతిరూపంగా ప్రభలు

- శతాబ్దాల చరిత్ర
- గగుర్పాటు కలిగించే ఊరేగింపు

ముమ్మిడివరం: సంక్రాంతి పండగకు చివరి రోజైన కనుమ నాడు స్థానికంగా నిర్వహించే ప్రభల తీర్థానికి ప్రత్యేకత ఉంది. లోక కల్యాణార్థం దక్ష ప్రజాప్రతి చేసే యజ్ఞానికి తనను ఆహ్వానించకపోవడంతో పరమశివుడు ఆగ్రహిస్తాడు. ఆయన ప్రళయ రుద్రుడై ఆవేశంతో నృత్యం చేస్తూ ఝటాఝూటాన్ని నేలకేసి కొట్టగా, కోటి సూర్య కాంతులతో వీరభద్రుడు జన్మిస్తాడు. అలా కోటి సూర్యుల తేజస్సు నుంచి ప్రభ ఉద్భవించింది. వీరభద్రుని స్వరూపంగా భావించి ప్రజలు ప్రభను పూజిస్తారు. ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, ఐ.పోలవరం మండలం మొక్కతోట, కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామాల్లో నిర్వహించే ప్రభల తీర్థానికి ప్రత్యేకత ఉంది.

గగుర్పాటు కలిగించే ప్రభల ఊరేగింపు

ప్రభల ఊరేగింపును చూస్తే ఒళ్లు గగుర్పాటు కలుగుతుంది. వివిధ గ్రామాల ప్రభలు పంట చేలు, కొబ్బరి తోటలు మురుగునీటి కాలువల మధ్య నుంచి వస్తాయి. దారిలో గొప్పులు, గోతులు ముళ్ల కంచెలు, మురుగునీటి కాలువలను దాటిస్తూ భక్తులు వాటిని తీర్థ ప్రదేశాలకు తీసుకు వచ్చే తీరు చూసి తీరవలసిందే. పల్లిపాలెంలో నిర్వహించే తీర్థానికి కొమానపల్లి, నడిమిలంక, ముమ్మిడివరం, అగ్రహారం, కొత్తలంక, వద్దిగూడెం, రాజుపాలెం, చింతలమెరక గ్రామాల నుంచి ప్రభలను తోడ్కొని వస్తారు.



తీర్థ స్థలానికి ప్రభను తోడ్కొని వస్తున్న భక్తులు (ఫైల్)

కన్నులపండువగా గోదాదేవి కల్యాణం



అమలాపురంలో కల్యాణం జరిపిస్తున్న త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి



కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్త జనం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ముగిసిన ధనుర్మాసోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో భీమవరం భాష్యకార పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో శనివారం గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భోగిని పురస్కరించుకుని గోదాదేవి, రంగనాథుని కల్యాణాన్ని రామానుజ జీయర్ స్వామి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కల్యాణ క్రతువు సాగింది. కల్యాణాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. జీయర్ స్వామి శిష్య బృందం నృత్యాలతో అలరించారు. రామానుజస్వామి గోదాదేవి రంగనాథుల పరిణయ విశేషాలను ప్రవచనాల రూపంలో భక్తులకు వివరించారు. పట్టణ వైశ్య సంఘం, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు ముగిశాయి. వైశ్య సంఘ అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, నంబూరి సత్యనారాయణమూర్తి, వరదా సూరిబాబు, వంకాయల కాశీ తదితరలు భక్తులకు సేవలు అందించారు.

ఉప్పలగుప్తం: ధనుర్మాసం సందర్భంగా భీమనపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైభవంగా గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో వివాహం కాని యువతీ, యువకులు సాంప్రదాయ దుస్తులతో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమనసలో వస్త్రదానం

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామానికి చెందిన గోకరకొండ శేషగిరిరావు, లక్ష్మి దంపతులు పరిసర గ్రామాల్లోని వృద్ధులకు శనివారం వస్త్రదానం చేశారు. గత 20 ఏళ్లుగా ఈ దంపతులు పేదలకు వస్త్ర దానం చేస్తున్నారు. దాదాపు రూ.50 వేల వ్యయంతో 150 మంది వృద్ధులకు వస్త్ర దానం చేశారు. కార్యక్రమంలో నాగా శ్రీనివాస్, తోట వెంకటేశ్వరరావు, నాగా వెంకటేశ్వర రావు, పెద్దిరెడ్డి సాయిబాబు, గోకరకొండ రామారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



అమలాపురంలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధి షిర్డీ సాయి బాబా మందిరం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు శనివారం జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, వర్రే శేషు తదితరులు పాల్గొన్నారు.

భట్టుపాలెంలో..

ఉప్పలగుప్తం: సంక్రాంతిని పురస్కరించుకొని భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, వ్యవసాయ మండలి చైర్మన్ మానే శ్రీను, జంపన బాపిరాజు, గణేష్ వర్మ, రాకుర్తి సుశీల తదితరులు పాల్గొన్నారు.



భట్టుపాలెంలో ముగ్గులను పరిశీలిస్తున్న సర్పంచ్ రాజ్‌కుమార్

రామన్నపాలెంలో...

తాళ్లరేవు: సంక్రాంతిని పురస్కరించుకుని పటవల పంచాయతీ రామన్నపాలెంలో శనివారం రంగవల్లుల పోటీలను గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. సుమారు 65 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న గ్రామపెద్దలను అభినందించారు. అనంతరం శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు.



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ సునీత

దివస్‌లో పన్నగ శయ్యన్

ముమ్మిడివరం: భారతీయ యువజన వ్యవహారాలు, క్రీడల విభాగం ఆధ్వర్యంలో ఇటీవల మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ప్రవాస భారతీయ దివస్‌లో మండలంలోని పల్లవారిపాలేనికి చెందిని చిక్కం పన్నగ శయ్యన్ పాల్గొన్నాను. దేశంలో మొత్తం 300 మంది వలంటీర్లను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేస్తే అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్ఎస్ఎస్ విభాగ ప్రతినిధిగా పన్నగ శయ్యన్ పాల్గొన్నారు. పన్నగ శయ్యన్‌ను పలువురు అభినందించారు.



దివస్ ప్రతినిధులతో చిక్కం పన్నగ శయ్యన్

కోడి పందేలకు ఓకే .. జూదాలకు బ్రేక్

- మిన్నకున్న పోలీసులు
- జూదగాళ్లలో నిరుత్సాహం

ముమ్మిడివరం: డి పందేలకు ఓకే చెప్పిన పోలీసులు, గుండాట, జూదాలను నో అంటూ అడ్డుకున్నారు. దాంతో జూదరులు నిరుత్సాహ పడ్డారు. సంక్రాంతి పండగ వచ్చిందంటే పందేల రాయుళ్లు కోడి పందేలా .. మజాకా అంటూ కాలు దువ్వుతారు. అయితే ఈ సారి పోలీసులు ఉక్కుపాదం మోపడంతో సాదా సీదాగా పందేలు జరిగాయి. కోడి పందేలకు కొస మెరుపుగా గుండాట, జూదాలతో రూ.కోట్లలో చేతులు మారేవి. ఈసారి వాటికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాదు ట్రాక్టర్లతో పందెం బరులను దున్నించారు. చివరకు రాజకీయ నాయకుల అండదండలతో కోడి పందేలకు మాత్రం వెసలు బాటు కల్పించారు. తాళ్లరేవు మండలం మినహా, ముమ్మిడివరం నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లో కోడి పందేలు సాదాసీదాగా జరిగాయి. తాళ్లరేవు మండలం జార్జిపేట, సుంకరపాలెంలలో కోడి పందేలతో పాటు, గుండాట, జూదాలు యథేచ్ఛగా నిర్వహించారు. ఆ మండలం కాకినాడ జిల్లా పరిధిలో ఉండడం, పోలీసులు నిబంధనలు సడలించడంతో బారికేడ్లు, ఎల్ఈడీ స్క్రీన్లతో బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ముమ్మిడివరం మండలం రాజుపాలెం, సీహెచ్ గున్నేపల్లి, అన్నంపల్లి, అయినాపురం, ఐ.పోలవరం మండలం ఎదుర్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం, కొమరగిరి, మురమళ్ల, గుత్తెనదీవి, కాట్రేనికోన మండలం చెయ్యేరు, గెద్దనాపల్లి, పల్లంకుర్రు, తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు, తీర గ్రామాల్లో పందేలు జరిగాయి.

మొదటి రోజు రూ. కోటి పైమాటే...

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి, కేశనకుర్రు, ఐ.పోలవరం, జి.వేమవరం గ్రామాల్లో శనివారం భారీ ఎత్తున కోడి పందేలు జరిగాయి. టెంట్లు, ఐరెన్ మెష్‌లతో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కొమరగిరిలో కోడి పందేలు వేశారు. అలాగే మురమళ్ల, ఐ.పోలవరం, జి.వేమవరం తదితర గ్రామాల్లో పందెపు రాయళ్ల ఉత్సాహంగా రూ. లక్షల్లో పందేలు కాశారు. ఈ ఏడాది మండలంలో కోడి పందేలు కొంత మందకొడిగా సాగాయి. రాష్ట్ర స్థాయిలో పేరుగాంచిన మురమళ్లలో కోడి పందేలు ఈసారి లేకపోవడంతో పెద్ద పందేలు వేసే వారు నీలపల్లి, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లా వైపు పయనమయ్యారు. తొలి రోజు మండలంలో కోడి పందేల వల్ల రూ.కోటి వరకూ చేతులు మారినట్టు అంచనా. మరో రెండు రోజుల పండగ ఉండడంతో మండలంలో రూ.5 కోట్ల వరకూ చేతులు మారే అవకాశం ఉంది.



కొత్తపల్లిలో బరిలో తలపడుతున్న కోడిపుంజులు

ఉప్పలగుప్తం మండలంలో..

ఉప్పలగుప్తం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కోడి పందేలు నిర్వహించారు. చల్లపల్లి, ఎస్.యానం, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో కోడి పందేల నిర్వాహకులు బరులు ఏర్పాటు చేసి పందేలను జరిపారు. వీటిని వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో బరుల వద్ద రద్దీ నెలకొంది .